పోలీస్ సిబ్బంది బాధ్యతతో పని చేయాలి : ఎస్పీ నరసింహ

పోలీస్ సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్పీ నరసింహ

పెన్‌పహాడ్, ఏప్రిల్ 16: పెన్‌పహాడ్ పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ కె.నరసింహ బుధవారం తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను, రికార్డులను, వివిధ నేరాల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను పరిశీలించారు. సిబ్బందిని అడిగి సమస్యలు తెలుసుకున్నారు. ఎటువంటి సమస్యలు ఉన్నా ఉన్నతాధికారులకు తెలియజేయాలని సూచించారు. సిబ్బంది బాధ్యతతో పని చేయాలని, డయల్ 100 ఫిర్యాదులు, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల సమస్యలపై త్వరితగతిన స్పందించాలని ఆదేశించారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగకుండా నిఘా పటిష్టం చేయాలని, గ్రామ పోలీస్ అధికారి వ్యవస్థను ప్రణాళికతో అమలు చేయాలని వివరించారు. గ్రామ పోలీస్ అధికారులు ప్రతి రోజు గ్రామాలను సందర్శిస్తూ ప్రజలతో సన్నిహితంగా ఉంటూ పోలీస్ సేవలను అందించాలని ఆదేశించారు. మండల పరిధిలో ఇసుక అక్రమ రవాణాను నివారించాలని, రవాణా చేసే వారిపై కేసులు నమోదు చేసి బైండోవర్ చేయాలని, వాహనాలను సీజ్ చేయాలని ఆదేశించారు. అనుమానాస్పద వ్యక్తులు గ్రామాల్లోకి వస్తే ఆశ్రయం ఇవ్వొద్దని, పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామాల్లో ప్రజలు ముందుకు రావాలని కోరారు. ఎస్పీ వెంట సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్, స్థానిక ఎస్ఐ గోపికృష్ణ, సిబ్బంది ఉన్నారు.

కాంటాల్లో తేడాలు లేకుండా చూడాలి : జడ్పీ సీఈఓ

ధాన్యం తేమ శాతాన్ని పరిశీలిస్తున్న జడ్పీ సీఈఓ అప్పారావు

మద్దిరాల, ఏప్రిల్ 16: ధాన్యం కాంటాలు వేసేటప్పుడు తేడాలు లేకుండా చూడాలని జడ్పీ సీఈఓ అప్పారావు అన్నారు. మండలంలోని పోలుమల్లలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. కేంద్రంలో కనీస సౌకర్యాలు ఉన్నాయా.. లేవా అనే విషయాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ధాన్యాన్ని తేమ లేకుండా ఆరబెట్టిన తర్వాతనే కాంటాలు వేయాలని చెప్పారు. నిర్వాహకులకు రైతులు సహకరిస్తూ కాంటాలు సక్రమంగా జరిగేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి, ఏపీఎం మైసయ్య, సెంటర్ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఆటో బోల్తాపడి మహిళా కూలీ దుర్మరణం

ఆత్మకూర్.ఎస్, ఏప్రిల్ 16: ఆటో బోల్తాపడి మహిళా కూలీ దుర్మరణం చెందిన ఘటన మండలంలోని కోటపహాడ్ గ్రామ శివారులో బుధవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. సూర్యాపేట మండల పరిధిలోని టేకుమట్ల గ్రామానికి చెందిన 22 మంది మహిళలు ఆత్మకూర్.ఎస్ మండలంలోని శెట్టిగూడెం గ్రామంలో మిరపకాయలు ఏరడానికి ఆటోలో బయలుదేరారు. మార్గం మధ్యలో కోటపహాడ్ గ్రామ శివారులోని చెరువు కట్టపైకి రాగానే అకస్మాత్తుగా కుక్క అడ్డు రావడంతో డ్రైవర్ కుక్కను తప్పించబోయే క్రమంలో ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో మాదరబోయిన యాదమ్మ (50) అనే మహిళ అక్కడికక్కడే మృతిచెందింది. మిగిలిన మహిళా కూలీలకు గాయాలయ్యాయి. గాయాలపాలైన వారిని స్థానికుల సాయంతో 108 అంబులెన్స్‌లో సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. యాదమ్మ కుమారుడు మాదరబోయిన లింగరాజు ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్ కేశరాజుపల్లి శంకర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

గాయపడిన మహిళలకు పరామర్శ

సూర్యాపేట టౌన్: ఆటో బోల్తాపడిన ఘటనలో గాయాలపాలైన మహిళలను సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి పరామర్శించారు. ప్రమాదంలో మృతిచెందిన యాదమ్మ కుటుంబానికి రూ.25 లక్షలు, గాయపడిన వారికి మెరుగైన వైద్యంతో పాటు రూ.10 లక్షలు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కూలీలను పరామర్శించిన వారిలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు, సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి, ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఆశలత, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దెల జ్యోతి తదితరులు ఉన్నారు.

నల్లాలకు బిగించిన మోటార్లు సీజ్

సీజ్ చేసిన మోటార్లతో మున్సిపల్ సిబ్బంది

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 16: సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో నల్లాలకు మోటార్లు పెట్టి నీటి చౌర్యానికి పాల్పడుతున్న నివాసాలపై బుధవారం మున్సిపల్ అధికారులు దాడులు నిర్వహించి 54 మోటార్లను సీజ్ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ మాట్లాడుతూ నల్లాలకు మోటార్లు పెట్టి నీటి చౌర్యానికి పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. రూ.5 వేల జరిమానా విధించడంతో పాటు శాశ్వతంగా నల్లా కనెక్షన్లు తొలగిస్తామని వెల్లడించారు. నల్లాలకు మోటార్లు పెట్టి నీటిని వాడుకోవడంతో ఇతర గృహాలకు వారికి నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

● ఆ పార్టీ మండలాధ్యక్షుడు అంజిరెడ్డి

పాలకవీడు, ఏప్రిల్ 16: వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27వ తేదీన జరుగనున్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు కిష్టిపాటి అంజిరెడ్డి కోరారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని గ్రామాల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు భూక్యా రవినాయక్, యరెడ్ల సత్యనారాయణరెడ్డి, తాటికొండ వెంకటరెడ్డి, పసుపులేటి సైదులు పాల్గొన్నారు.

'అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి'

అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యోగులు, కార్మికులు

చింతలపాలెం, ఏప్రిల్ 16: అగ్ని ప్రమాదాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జువారి పరిశ్రమ హెడ్ వర్క్స్ జీఎన్‌బీ.రావు అన్నారు. అగ్ని ప్రమాదాల నివారణ మార్గదర్శకాలను తప్పక పాటించాలని సూచించారు. మండల పరిధిలోని జువారి పరిశ్రమలో సీతాపురం ప్లాంట్ ఉద్యోగులు, కార్మికులకు ఫైర్ ఫైటింగ్‌పై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమ పరిసరాల్లో అగ్ని ప్రమాదాల నివారణ, రక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. అనంతరం డిప్యూటీ జనరల్ మేనేజర్ షేక్ కరిముల్లా ప్రతి సంవత్సరం నిర్వహించే ఫైర్ సర్వీస్ డే వీక్ ప్రాముఖ్యతను, నేపథ్యాన్ని వివరించారు. పని ప్రదేశంలో అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో జువారి పరిశ్రమ ఫైర్ సేఫ్టీ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్‌లో బడిబాట ర్యాలీ

బడిబాట ర్యాలీలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

పెన్‌పహాడ్, ఏప్రిల్ 16: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు గ్రామంలో బుధవారం బడిబాట ర్యాలీ నిర్వహించారు. వచ్చే విద్యా సంవత్సరానికి పాఠశాలలో అధిక సంఖ్యలో విద్యార్థులను చేర్పించేందుకు ఇంటింటికి తిరిగి ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల వివరాలను సేకరించి ప్రభుత్వ బడిలో చేర్పించేందుకు తల్లిదండ్రులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రభుత్వం పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలను వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ నకిరెకంటి రవి తదితరులు పాల్గొన్నారు.

మత్తుకు యువత బానిస కావద్దు

● కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

డ్రగ్స్ నిర్మూలన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ నరసింహ

సూర్యాపేట, ఏప్రిల్ 16: యువత మత్తుకు బానిసగా మారి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నార్కోటిక్ కో-ఆర్డినేషన్ సెంటర్‌పై ఎస్పీ నరసింహతో కలిసి బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డ్రగ్స్ వలన కలిగే నష్టాలపై విద్యార్థులకు, యువతకు తెలిసేలా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. డ్రగ్స్ బారినపడిన వారు వాటి నుంచి బయటపడేందుకు డీ అడిక్షన్ సెంటర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. అనంతరం ఎస్పీ నరసింహ మాట్లాడుతూ అందరూ ప్రతి బుధవారం డ్రగ్స్ నిర్మూలనకు సంబంధించిన పోస్ట్ వాట్సాప్ స్టేటస్, డీపీలుగా పెట్టుకోవాలని కోరారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యాంటీ నార్కోటిక్ డ్రగ్స్ డీఎస్పీ భిక్షపతిరావు, డీటీఓ సురేశ్‌కుమార్, డీఈఓ అశోక్, డీఐఈఓ భానునాయక్, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై బ్లాక్ స్పాట్‌లను గుర్తించాలి

ప్రజల ప్రాణాలను కాపాడేందుకు రోడ్లపై బ్లాక్ స్పాట్‌లను గుర్తించడానికి రెవెన్యూ, పోలీస్, ఆర్‌అండ్‌బీ, జాతీయ రహదారుల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఎస్పీ నరసింహతో కలిసి రోడ్డు భద్రతపై సమీక్షించారు. బ్లాక్ స్పాట్‌లను గుర్తించిన చోట బ్లింకింగ్ లైట్స్, సూచిక బోర్డులు, బారికేడ్లు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్‌హెచ్ 365ఏ అధికారులు సమావేశానికి హాజరుకాకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శాఖపరమైన చర్యలకు సంబంధిత అధికారులకు నోటీసులు పంపాలని సూచించారు. ఆర్డీఓ వేణుమాధవరావు, డీటీఓ సురేశ్‌కుమార్, ఆర్ అండ్‌బీ ఎస్ఈ సీతారామయ్య, ఆబ్కారీ సూపరింటెండెంట్ లక్ష్మనాయక్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, డీఈఓ అశోక్, డీఐఈఓ భానునాయక్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్లకు ఉచిత ఇసుక

ఇందిరమ్మ ఇండ్లకు ఉచితంగా ఇసుక ఇవ్వనునట్లు కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఇసుక విధానంపై ఎస్పీ నరసింహతో కలిసి సమీక్షించారు. జిల్లాలోని ఇందిరమ్మ ఇండ్లకు, నీటిపారుదల శాఖకు మాత్రమే ఉచిత ఇసుక ఇస్తామని చెప్పారు. తాసీల్దార్ జారీ చేసిన వే బిల్లులో సమయం, వాహన నంబర్, ఫోన్ నంబర్, ఎక్కడి నుంచి ఎక్కడికి తరలిస్తున్నారో వివరాలు నమోదు చేసిన తర్వాతనే అనుమతి ఇవ్వాలన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య : ఎంఈఓ

శ్రీరంగాపురంలో ఇంటింటి ప్రచారంలో ఎంఈఓ సలీంషరీఫ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు

కోదాడ రూరల్, ఏప్రిల్ 16: కోదాడ పట్టణ పరిధిలోని శ్రీరంగాపురం, అశోక్‌నగర్‌లోని ప్రాథమిక పాఠశాలలో మండల విద్యాధికారి ఎండీ. సలీంషరీఫ్ ఆధ్వర్యంలో కోదాడ బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు బుధవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న విద్య, సౌకర్యాలపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి సలీంషరీఫ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు యూనిఫాం, పాఠ్య, నోటు పుస్తకాలు అందిస్తున్నట్లు తెలిపారు. కోదాడ బాలుర ఉన్నత పాఠశాలలో 6వ తరగతి అడ్మిషన్లు జరుగుతున్నాయని, ఐదో తరగతి పూర్తి చేసుకుంటున్న విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎంలు డి.మార్కండేయ, బి.బాలరాజు, ఉపాధ్యాయులు జానకిరామ్, పి.ఏడుకొండలు, శ్రీనివాసరెడ్డి, పాండురంగాచారి, ఎస్‌కే.జానిమియా, రవికుమార్, బడుగుల సైదులు, ముక్తార్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దగట్టులో కొబ్బరికాయల విక్రయానికి నేడు వేలం

చివ్వెంల, ఏప్రిల్ 16: పెద్దగట్టు లింగమంతుల స్వామి ఆలయం వద్ద కొబ్బరికాయలు విక్రయించుకునేందుకు గానూ దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో గురువారం ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు పెద్దగట్టు ఆలయ కార్యనిర్వహణ అధికారి కె.కుశలయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనాలనుకునే వారు లింగమంతుల స్వామి దేవస్థానం పేరు మీద డీడీ, నగదు రూపంలో రూ.లక్ష డిపాజిట్ చేయాలని సూచించారు. ఈ నెల 20వ తేదీ నుంచి 2027లో జరుగనున్న జాతర దిష్టి పూజా కార్యక్రమం ముందు రోజు వరకు కొబ్బరికాయలు విక్రయించుకునే హక్కు ఉంటుందని తెలిపారు.

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

● మండల ప్రత్యేకాధికారి జగదీశ్వర్‌రెడ్డి

ధాన్యం తేమ శాతాన్ని పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి జగదీశ్వర్‌రెడ్డి

చివ్వెంల, ఏప్రిల్ 16: రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్ముకోవాలని మండల ప్రత్యేకాధికారి కె.జగదీశ్వరరెడ్డి అన్నారు. మండల పరిధిలోని అక్కలదేవిగూడెంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. రైతులు నాణ్యమైన ధాన్యం ఆరబెట్టుకొని తీసుకొచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయానిన సందర్శించి విద్యార్థినుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా భోజనాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ సంతోశ్‌కుమార్, ఎస్ఓ నాగలక్ష్మి, ఏపీఎం సైదయ్య, సీసీలు ఉపేందర్, వెంకన్న, సిబ్బంది ఉన్నారు.

'గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి'

చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

తిరుమలగిరి, ఏప్రిల్ 16: మండల పరిధిలోని జలాల్‌పురం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ పక్షం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అక్షరాభ్యాసం జరిపారు. అనంతరం సూపర్‌వైజర్ ఖైరున్నీసా మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటే పుట్టే బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. అదేవిధంగా తల్లి ముర్రుపాలు చిన్నారుల్లో రోగనిరోధక శక్తిని పెంచుతాయని చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు శాంత, రేణుక, మాధవి, మమత, కస్తూరి, హెల్పర్ రాణి తదితరులు పాల్గొన్నారు.

'ఇందిరమ్మ ఇండ్లను నిబంధనల మేరకు నిర్మించుకోవాలి'

చిలుకూరు, ఏప్రిల్ 16: ప్రభుత్వం సూచించిన ప్రకారం ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకోవాలని, అప్పుడే బిల్లులు నిబంధనల ప్రకారం మంజూరు అవుతాయని కోదాడ నియోజకవర్గ హౌసింగ్ ఏఈ జేఎస్.మూర్తి అన్నారు. చిలుకూరు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో చేపడుతున్న నమూనా ఇందిరమ్మ ఇండ్ల పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 400 చదరపు అడుగుల కంటే ఎక్కువ, 500 చదరపు అడుగుల లోపే ఇండ్లు నిర్మించుకోవాలని, ఇష్టానుసారంగా నిర్మాణం చేపడితే బిల్లు మంజూరుకావని తెలిపారు. లబ్ధిదారులు మండల పరిషత్ కార్యాలయం పక్కన నిర్మిస్తున్న నమూనా ఇండ్లను పరిశీలించి దాని ప్రకారం నిర్మాణాలు చేపట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఇసుక డంప్ సీజ్

ఇసుక డంప్‌ను సీజ్ చేస్తున్న రెవెన్యూ అధికారులు

తిరుమలగిరి, ఏప్రిల్ 16: తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని ఈదుల పర్రెతండాలో గుర్తు తెలియని వ్యక్తులు డంప్ చేసిన నాలుగు ట్రిప్పుల ఇసుకను నాయబ్ తాసీలార్ జాన్ మహ్మద్ బుధవారం సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమంగా ఇసుక తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇసుక అక్రమ తరలింపును అడ్డుకునేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది కలిగించొద్దు : తాసీల్దార్

చిలుకూరు, ఏప్రిల్ 16: మండల కేంద్రం చిలుకూరులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తాసీల్దార్ ధ్రువకుమార్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యాన్ని ఎప్పటికప్పుడు కొనుగోలు చేసి రవాణా చేయాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శ్రీధర్, ఆర్ఐ సీతయ్య, ఏపీఎం నర్సయ్య, ఏఈఓ శిరీష, సీపీ స్వరూప తదితరులు పాల్గొన్నారు.

'కార్మికుల సమస్యలను పరిష్కరించాలి'

మేళ్లచెర్వు, ఏప్రిల్ 16: పెండింగ్‌లో ఉన్న గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు వట్టెపు సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు పనికి తగ్గ కనీస వేతనం చెల్లించాలని కోరారు. ఈ నెల 19వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్త సమ్మె చేపట్టనున్న పంచాయతీ కార్మికులకు సీఐటీయూ మద్దతు ఉంటుందని ప్రకటించారు. ఆయన వెంట అశోక్, జానీ, శంకర్ ఉన్నారు.

భూభారతి పోర్టల్‌పై నేడు అవగాహన సదస్సు

నేరేడుచర్ల, ఏప్రిల్ 16: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన భూభారతి పోర్టల్‌పై గురువారం నేరేడుచర్లలో అవగాహన సదస్సును నిర్వహిస్తున్నట్లు తాసీల్దార్ సురిగి సైదులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఎస్ఆర్ ప్రైడ్ ఫంక్షన్ హాల్‌లో మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించే అవగాహన సదస్సుకు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ముఖ్య అతిథిగా హాజరై భూభారతి పోర్టల్‌పై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. అధికారులు హాజరు కావాలని కోరారు.

ఆర్థిక సాయం

తుంగతుర్తి, ఏప్రిల్ 16: మండల పరిధిలోని వెంపటి గ్రామానికి చెందిన దికొండ కృష్ణ తల్లి సోమక్క ఇటీవల అనారోగ్యంతో మరణించారు. కృష్ణతో కలిసి పదో తరగతి చదివిన స్నేహితులు బుధవారం రూ.26 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో జెక్కి సతీశ్, గుండగాని దినేశ్, లకాకుల సోమయ్య, పుల్లూరి అంబేద్కర్, గోరోజి మురళీచారి, బొడ్డు అనిల్, ఆకుల లింగయ్య, భూక్యా శ్రీను, గుండగాని ఉదయ్, సంటి వెంకన్న, నోముల అశోక్, సగం మురళి, గుగులోతు ఉపేందర్, గోపగాని సురేశ్, తోడేటి లింగయ్య, కొండ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

గరిడేపల్లి, ఏప్రిల్ 16: మండల పరిధిలోని పొనుగోడు గ్రామానికి చెందిన గుండెల శేషమ్మ ఇటీవల విద్యుత్ షాక్‌తో మరణించారు. శేషమ్మతో కలిసి ఇంటర్మీడియట్ చదివిన స్నేహితులు బుధవారం ఆమె కుటుంబానికి రూ.8 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు చామకూరి అంజిగౌడ్, మద్దిమడుగు అరవింద్, బత్తిని విజయ్, ఉపేందర్, జనార్ధన్, నర్సింహారావు, మంగ సైదులు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

మాచారం రామాలయంలో చోరీ

పెన్‌పహాడ్, ఏప్రిల్ 16: మండల పరిధిలోని మాచారం రామాలయంలో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు గుడి తలుపుల తాళాన్ని పగులగొట్టి లోపలికి ప్రవేశించి అమ్మవారి మెడలోని 8 గ్రాముల బంగారు పుస్తెలతాడు, 35 గ్రాముల వెండి శఠగోపం దొంగతనం చేసినట్లు ఆలయ చైర్మన్ బొల్లక రామచంద్రయ్య తెలిపారు. దొంగతనంపై బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ రాజశేఖర్, ఎస్ఐ కస్తాల గోపికృష్ణ ఆలయం వద్దకు వెళ్లి పరిశీలించారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

● అదనపు కలెక్టర్ రాంబాబు

కొనుగోలు కేంద్రంలో అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాంబాబు

మునగాల, ఏప్రిల్ 16: ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ రాంబాబు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. మండల పరిధిలోని బరాఖత్‌గూడెం గ్రామ శివారులో మునగాల సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రస్తుతం అకాల వర్షాలు కురుస్తున్నందున ధాన్యం తడవకుండా రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకొచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని తెలిపారు. ధాన్యాన్ని కాంటా వేసిన వెంటనే మిల్లులకు తరలించాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం మునగాలలోని ఎస్పీ బాలికల వసతి గృహాన్ని, జడ్పీహెచ్ఎస్‌ను సందర్శించారు. అదనపు కలెక్టర్ వెంట తాసీల్దార్ ఆంజనేయులు, ఎంఈఓ వెంకటేశ్వర్లు, సీఈఓ బసవయ్య ఉన్నారు.

వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలి

● డీఎంహెచ్ఓ కోటాచలం

రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ కోటాచలం

అర్వపల్లి, ఏప్రిల్ 16: వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్ఓ కోటాచలం వైద్య సిబ్బందిని ఆదేశించారు. అర్వపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ వైద్య సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రభుత్వ ఆసుపత్రిలో సహజ కాన్పుల సంఖ్యను పెంచాలని సూచించారు. గర్భిణులకు సహజ కాన్పులపై సలహాలు, సూచనలు అందిస్తూ ప్రభుత్వం ద్వారా అందే ప్రయోజనాల గురించి అవగాహన కల్పించాలని చెప్పారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించకున్నా, విధుల పట్ల నిర్లక్ష్యం వహించినా శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకుంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో డాక్టర్ భూక్యా నగేశ్‌నాయక్, సీహెచ్ఓ మాలోతు బిచ్చునాయక్, సూపర్‌వైజర్ లలిత, నర్సింగ్ ఆఫీసర్ సునీత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అకాల వర్షానికి తడిసిన ధాన్యం

ధాన్యం రాశులపై నిలిచిన నీటిని తొలగిస్తున్న రైతు

హుజూర్‌నగర్ రూరల్, ఏప్రిల్ 16: మండల పరిధిలోని వేపలసింగారం గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి ఈదురు గాలులతో కూడిన అకాల వర్షం కురిసింది. దీంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులపై కప్పిన పట్టాలు ఎగిరిపోయి ధాన్యం తడిసి ముద్దయింది. అదేవిధంగా పలువురు రైతులకు చెందిన వరి చేలు నేలకొరిగాయి. దీంతో తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు. ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

చలివేంద్రం ప్రారంభం

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న తాసీల్దార్ హరిప్రసాద్

తిరుమలగిరి, ఏప్రిల్ 16: మండల కేంద్రంలోని తాసీల్దార్ కార్యాలయంలో తాసీల్దార్ హరిప్రసాద్ బుధవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యాలయానికి వచ్చే ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట